ఏ ఒక్క కుటుంబానికీ అన్యాయం చేయొద్దు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, జనవరి 5 : ప్రజాపాలన ఆరు గ్యారెంటీ పథకాల అమలులో ఏ ఒక్క కుటుంబానికి అన్యాయం చేయవద్దని, ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక దృష్టి సారించి పథకం అందేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని విద్యానగర్ కాలనీ పంచాయతీలో జరిగిన గ్రామసభను ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందనే నమ్మకంతోనే ప్రజలు అధికారం అందించారని, ఆ నమ్మకానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, మండల ప్రత్యేక అధికారి సులోచనరాణి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, సీఐ పెద్దన్నకుమార్, ఎస్సై ప్రవీణ్, విద్యానగర్ కాలనీ సర్పంచ్ బానోత్ గోవిందు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమావేశాన్ని జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాల్వంచ, జనవరి 5 : హైదరాబాద్ తెలంగాణభవన్‌లో ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అధ్యక్షతన జరుగనున్న ఖమ్మం పార్లమెంటరీ సమావేశానికి పాల్వంచ పట్టణ, మండలాల నుంచి అధికసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల నాయకులు కోరారు. పాల్వంచ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కిలారు నాగేశ్వరరావు ఇంట్లో శుక్రవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని టీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడి సరస్వతి, మహిపతి రామలింగం, కాంపెల్లి కనకేశ్, ప్రకాష్‌రావు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరాంమూర్తి, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, చింతా నాగరాజు పాల్గొన్నారు.

అధికారులకు న్యూఇయర్ శుభాకాంక్షలు

రామవరం, జనవరి 5 : సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్‌సింగ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా జీఎంతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సభలను సద్వినియోగం చేసుకోండి

జూలూరుపాడు, జనవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారెంటీల అమలు కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో విద్యాలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెంగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. హెల్ప్‌డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను పరిశీలించారు.

వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేట, జనవరి 5: భూ వివాదంలో అశ్వారావుపేట పోలీసుస్టేషన్‌లో ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జమ్మిగూడెం గ్రామానికి చెందిన ఆళ్ల వెంకటేశ్వరరావు, పెన్నాడ రామకృష్ణ మధ్య భూ వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం వెంకటేశ్వరరావు నివాసం ఉంటున్న ఇంటికి రామకృష్ణ తాళం వేసి దౌర్జనం చేశాడు. అయితే, ఇంట్లోని ల్యాప్‌టాప్‌ను తీసుకెళ్లినట్లు వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు గిరిజన రైతు బలి

పురుగుమందు తాగినా పట్టించుకోకుండా వెళ్లిన సంస్థ ప్రతినిధులు

పర్ణశాల, జనవరి 5: ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు ఓ గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం గోవిందాపురానికి చెందిన గిరిజన రైతు కొమరం రామారావు (55) ఓ ఫైనాన్స్ కంపెనీలో ఫైనాన్స్ తీసుకొని ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. చెల్లింపులు సకారంలో చేస్తున్నప్పటికీ సంస్థ ప్రతినిధులు అధిక వడ్డీలు భారం మోపారు. వాటి గురించి తన సన్నిహితుల దగ్గర కూడా ఇటీవలే చర్చించాడు. అధిక వడ్డీల గురించి కొంతకాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం సదరు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు రైతు రామారావు ఇంటికి వచ్చారు. వడ్డీ డబ్బులు కట్టాలంటూ ఒత్తిడి చేశారు. పంట అమ్మి కడతానని చెప్పినా సంస్థ ప్రతినిధులు వినకపోవడంతో వారి ముందే ఆయన పురుగుమందు తాగాడు. దీంతో కనీస కనికరం లేకుండా సదరు కంపెనీ ప్రతినిధులు అతడిని అక్కడే వదిలి వెళ్లారు. ఆ సమయంలో అతడి ఇంట్లో కూడా ఎవరూ లేకపోవడంతో అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తరువాత స్థానికులు గమనించి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం అతడు మరణించాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, ఈ ఘటనపై కుటుంబ సభ్యులు దుమ్ముగూడెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తగూడెం అర్బన్, జనవరి 5 : మేదరబస్తీలోని విశ్వబ్రాహ్మణ సత్రం వేదికగా పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం 2024 క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ కందుకూరి శివప్రసాద్ పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ బ్రహ్మశ్రీ వసుధ విజయ్‌కుమార్ హాజరుకాగా సంఘం కార్యదర్శి ఆనందాచారి, బెజ్జంకి శ్రీనివాస్, జవీబీ ప్రసాద్, కందుకూరి బ్రహ్మయ్య, సిరికొండ రమేశ్, ప్రతినిధులు అప్పారావు, సదానందం, నవీన్, వెంకట వీరాచారి పాల్గొన్నారు.

రామయ్యకు విలాసోత్సవం

స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

- భద్రాద్రి రామాలయంలో ముగిసిన ఏకాదశి విలాసోత్సవాలు
- 8న విశ్వరూప సేవ, 12 కూడారై ఉత్సవం, 14న భోగి పండుగ
- 15న సంక్రాంతి, రాత్రిపూట రథోత్సవం, ప్రణయ కలహోత్సవం

భద్రాచలం, జనవరి 5: ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన విలాసోత్సవాలు ముగిశాయి. ఏకాదశికి ముందు 10 రోజులు పగల్ పత్తు ఉత్సవాలు, ఏకాదశి తరువాత 10 రోజులు రాపత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు. అయితే రాపత్తు ఉత్సవాలు జనవరి 2తో ముగిశాయి. దీంతో మూడు రోజుల పాటు విలాసోత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 8న స్వామివారికి విశ్వరూప సేవను నిర్వహించనున్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న కూడారై ఉత్సవాన్ని జరుపుతారు. 14న భోగి, 15న మకర సంక్రాతి పండుగలను జరుపుతారు. అదేరోజు రాత్రి స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు. తిరువీధి సేవ ముగిసిన తరువాత రామయ్యకు ప్రణయ కలహోత్సవం జరుపనున్నారు. డిసెంబర్ 13న ప్రారంభమైన విలాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. విలాసోత్సవాల్లో ఆఖరు రోజు విలాసోత్సవాన్ని దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం రామనిలయంలో ఉన్న వశిష్ట మండపంలో స్వామివారికి వైభవంగా విలాసోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో రమాదేవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయంలో సుదర్శన హోమం..

చిత్తా నక్షత్రం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం అర్చకులు ఆలయ యాగశాలలో శుక్రవారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ముందుగా వైష్ణవ సంప్రదాయం ప్రకారం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, కలశ ప్రతిష్టాపన, అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. పూర్ణాహుతిలో నవ ధాన్యాలు, పట్టు వస్త్రం, బంగారం, పగడం తదితర హోమ ద్రవ్యాలను వేశారు.

నేడు రామయ్యకు రాజఖడ్గం సమర్పణ..

జగద్గురు శ్రీమాన్ మధ్వాచార్య మూల మహా సంస్థానం శ్రీమద్ ఉత్తరాది మఠాధీశులైన శ్రీ 1008శ్రీ సత్యాత్మతీర్థ శ్రీపాదులతో భద్రాద్రి రామయ్యకు రాజఖడ్గం సమర్పించనున్నారని దేవస్థానం ఈవో రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఉత్తరాది మఠ సంస్థాన మూలమూర్తులైన శ్రీ దిగ్విజయరామ శ్రీ మూలసీతా సమేత శ్రీమన్ మూలరామ వేదవ్యాస సంస్థాన దేవతా పూజ జరుపనున్నట్లు చెప్పారు.

గోదాదేవికి వెండి తొడుగు బహూకరణ

దమ్మపేట రూరల్, జనవరి 5: దమ్మపేట శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, ఆళ్వారులతో కూడిన రుక్మిణి, సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవికి సత్తుపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాసరావు తన తండ్రి నారాయణరావుల జ్ఞాపకార్థం అమ్మవారికి వెండి తొడుగును చేయించాడు. దానిని శుక్రవారం ఆయల కమిటీ బాధ్యులకు అందచేశాడు. అలాగే, దమ్మపేటకు చెందిన వజ్రపు లక్ష్మీనారాయణ తన తండ్రి, తల్లి, సోదరుడి జ్ఞాపకార్థం గోదా, రంగనాథుల ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలు బహూకరించారు.

సీఎండీని కలిసిన సంఘం ప్రతినిధులు

సీఎండీకి మెమోరాండం ఇస్తున్న సీఎంవోఏఐ ప్రతినిధులు

రామవరం, జనవరి 5 : సింగరేణి అధికారుల సంఘం సీఎంవోఏఐ ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఎంవోఏఐ సింగరేణి బ్రాంచి అధ్యక్షుడు జక్కం రమేశ్, జనరల్ సెక్రటరీ ఎన్‌వీ రాజశేఖర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సలీం షేక్, వైస్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, డాక్టర్ రమేశ్‌బాబు, హరినాథ్ సారంగి పాల్గొన్నారు.

'జాయ్ స్మైల్ ఫౌండేషన్ ఏర్పాటు అభినందనీయం'

చండ్రుగొండ, జనవరి 5: మద్దుకూరు గ్రామానికి చెందిన పాస్టర్ జడ్సన్ (కుంజా రామకృష్ణ) జాయ్ స్మైల్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మద్దుకూరులో శుక్రవారం కార్యక్రమంలో జాయ్ స్మైల్ ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాస్టర్ జడ్సన్ కుమార్తె ఏడాది క్రితం ప్రమాదవశాత్తూ మరణించడంతో ఆమె జ్ఞాపకార్థంగా ఆయన ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. ఇకపై చిన్నారులెవరూ ఇలా చనిపోకూడదనే, పేదలను ఆదుకోవాలనే తపనతోనే ఈ ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సర్పంచ్ పద్దం వినోద, పాస్టర్స్ అసోసియేషన్ బాధ్యులు కిరణ్‌పాల్, ఆర్ఆర్‌రాజు, ఏసురత్నం, లాజరస్, ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో సామూహిక కుంకుమార్చన

కుంకుమార్చనలో మహిళా భక్తులు

పాల్వంచ, జనవరి 5 : పట్టణంలోని శ్రీ సీతారామాలయంలో వేద పండితుడు శ్రీ గోపాలాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. చిన్నజీయర్‌స్వామి ప్రథమ శిష్యుడు దేవనాథ జియర్‌స్వామి భక్తులకు సూక్తులు, ప్రవచనాలు తెలిపారు. ఆలయ ఈవో రజినికుమారి ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజల్లో రామాలయ సేవాదళ్ సభ్యులు పెండ్యాల రోజాలక్ష్మి, కొండ్లె ఉమాసావిత్రి, రంగా శిరీష, వారణాసి ధనలక్ష్మి, పసుమర్తి నిర్మల, స్రవంతి, సుమ, హారిక, వాసవి, సుజాత, పసుమర్తి మౌనిక, లత, ఝాన్సీ, కవిత, జయశ్రీ, మంజుల పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో జవాన్ల వాహనం బోల్తా

17 మందికి గాయాలు

కొత్తగూడెం క్రైం, జనవరి 5: ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్లి వస్తున్న జవాన్ల వాహనం బోల్తాపడింది. ఘటనలో 17 మంది జవాన్లు గాయాలపాలయ్యారు. నారాయణ్‌పూర్ జిల్లా ఎస్పీ పుష్కర్ శర్మ మీడియాకు వివరాలు వెల్లడించారు. కాంకేర్– నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దులోని దండకారణ్యంలో కొద్దిరోజుల నుంచి బీఎస్ఎఫ్ జవాన్లు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం వ్యాన్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. వాహనం రావ్‌ఘాట్–తాడోకి ప్రాంతాల మధ్యకు చేరుకోగానే వ్యాన్ స్టీరింగ్ ఫేయిల్ అయి బోల్తాపడింది. ప్రమాదంలో 17 మంది జవాన్లకు గాయాలయ్యారు. తోటి ప్రయాణికులు క్షతగాత్రులను నారాయణ్‌పూర్ జిల్లా ప్రభుత్వాప్రధాన ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పస్థితి విషమంగా ఉందని, వారికి మెరుగైన చికిత్స అందించేందుకు రాయ్‌పూర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

వేతనాలు ఇవ్వాలని సీఆర్పీల వినతి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 5 : జిల్లా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 620 మంది సీఆర్‌పీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని సీఆర్‌పీలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, కేజీబీవీలోని సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీలు, యూఆర్ఎస్‌లోని సిబ్బంది, భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలు, ఆయాలు నిరసన తెలిపారు. శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరాచారికి వినతిపత్రం అందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పాల్వంచ, జనవరి 5 : రోడ్డు ప్రమాదంలో ఓ భక్తుడు మృతిచెందిన ఘటన జగన్నాథపురం సమీపంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కొత్తపోచారానికి చెందిన మలీద్ అంజయ్య(55) అనే భక్తుడు నడుచుకుంటూ భద్రాచలం వెళ్తున్నాడు. రాత్రివేళ గ్రామాల్లో బస చేసుకుంటూ వెళ్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున నడుచుకుంటూ వెళ్తుండగా జగన్నాథపురంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనదారులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

పాల్వంచ, జనవరి 5 : మున్సిపాలిటీ పరిధిలోని కేఎస్ఎం మైనింగ్ కాలేజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొత్తపల్లి పున్నంచంద్ ఇంట్లో చోరీ జరిగింది. రూ.5.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు గత నెల 21వ తేదీన వరంగల్ యూనివర్సిటీలో పని నిమిత్తం వెళ్లారు. తన భార్య కూడా అదే నెల 23వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లారు. వారిద్దరూ తిరిగి ఈ నెల 3వ తేదీన యూనివర్సిటీ ఆవరణలోని క్వార్టర్స్‌లో ఉన్న ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చి చూసే సరికే ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్సై బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని వినతి

చండ్రుగొండ, జనవరి 5: స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన తెలంగాణ ఉద్యమకారుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. చండ్రుగొండ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన ఉద్యమకారుల సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. తొలుత మండల ప్రత్యేకాధికారి సంజీవరావుకు వినతిపత్రం సమర్పించారు.

నిరుపేదలకు రగ్గుల పంపిణీ

లక్ష్మీదేవిపల్లి, జనవరి 5 : మండలంలోని ఎదురుగడ్డ పంచాయతీలో లెప్రసీ కాలనీలో సుమారు 150 నిరుపేద కుటుంబాలకు జీఎస్ఎస్(గ్రేస్ సర్వీస్ సొసైటీ) ఆధ్వర్యంలో కుటుంబానికి చీరె, షర్ట్, రగ్గులను సర్పంచ్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం శాలెంరాజు

రామవరం, జనవరి 5 : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని, ప్రతిఒక్కరూ తప్పక శారీర శ్రమకు సమయం కేటాయించి వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఏరియా జీఎం శాలెంరాజు అన్నారు. రుద్రంపూర్ ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో సింగరేణి ఎగ్జిక్యూటివ్‌లకు కంపెనీ లెవల్ క్రికెట్ మ్యాచ్‌ను ఏరియా జీఎం సేఫ్టీ గురవయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు క్రీడలకు కూడా కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, సూపర్‌బజార్ ఎండీ సామ్యూల్ సుధాకర్, ఏజీఎం సివిల్ రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, ఏజెంట్ రవీందర్, సీఎంవోఏఐ అధ్యక్షుడు పాలడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'చెవి, ముక్కు, గొంతు సమస్యను గుర్తించాలి'

భద్రాచలం, జనవరి 5: చిన్నారుల్లో వచ్చే చెవి, ముక్కు, గొంతు సమస్యలను తల్లిదండ్రులు త్వరగా గుర్తించాలని భద్రాచలం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి సూచించారు. పట్టణంలోని జగదీశ్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో పిల్లల కోసం శుక్రవారం ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. సమస్యలను ముందుగా గుర్తించినట్లయితే వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించే అవకాశం ఉంటుందని, తద్వారా పిల్లలు ఆయా సమస్యల నుంచి బయట పడతారన్నారు. అనంతరం డాక్టర్ చావా యుగంధర్, డాక్టర్ ఎల్.సురేశ్‌కుమార్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

భద్రాచలం, జనవరి 5: పట్టణానికి చెందిన కొంజర్ల సుధీర్‌కుమార్ తన కుమార్తె హాసిని పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కూనవరం రోడ్డులోని సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. దుర్గా స్వీట్స్ అధినేత బిర్రు సుధాకర్, సరిత దంపతుల ఆధ్వర్యంలో అక్కడ కేక్ కట్ చేశారు.

కూలిన తహసీల్దార్ క్వార్టర్ ప్రహరీ

భద్రాచలం, జనవరి 5: భద్రాచలం తహసీల్దార్ క్వార్టర్ ప్రహారీ గోడ శుక్రవారం సాయంత్రం ఆకస్మాత్తుగా కూలింది. ఆ ధాటికి దాని పక్కనే నిలిపి ఉన్న రిక్షా ధ్వంసమైంది. అయితే, గోడ నిర్మాణంలో నాణ్యతాలోపంతో పాటు పక్కనే చెట్లు ఉండడంతో వాటి వేర్లు గోడ కిందకు వెళ్లడంతో అడుగు భాగం పెకిలి గోడ కూలి ఉంటుందని స్థానికులు అంటున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

బూర్గంపహాడ్, జనవరి 5: మండలంలోని కృష్ణసాగర్ పంచాయతీకి చెందిన నిరుపేదరాలు దాసరి రాజమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబానికి కాంగ్రెస్ నాయకురాలు బర్ల నాగమణి శుక్రవారం 50 కిలోల బియ్యం అందించారు. నాయకులు బోడ దివ్య, భూక్యా సుగుణ, కువ్వారపు వెంకటేష్ పాల్గొన్నారు.

తిరిగి విధుల్లోకి ఏఎంసీ సెక్రటరీ

బూర్గంపహాడ్, జనవరి 5: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్మల ఇటీవల సెలవుపై విదేశాలకు వెళ్లారు. స్వదేశానికి తిరిగొచ్చిన ఆమె శుక్రవారం విధుల్లో చేరారు.

సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ

మణుగూరు టౌన్, జనవరి 5: సింగరేణి క్యాలెండర్‌ను మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచంద్రరావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. జీఎంలు, డీజీఎంలు, పీవోలు, ఇతర అధికారులు వీసం కృష్ణయ్య, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, కె.వెంకట్‌రావు, రమేష్, వీరభద్రుడు, మాధవ్ నాయక్, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్సిడీకి ధ్రువపత్రాలు ఇవ్వాలి

పినపాక, జనవరి 5: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నదని విద్యుత్ శాఖ మండల ఏఈ కావ్య ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ కావాలనుకున్న వినియోగదారులు కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను విద్యుత్ బిల్లుకు జత చేసి విద్యుత్ శాఖ కార్యాలయాల్లోగానీ, లైన్‌మెన్లకుగానీ, ప్రజాపాలన గ్రామసభల్లోగానీ ఇవ్వచ్చని వివరించారు.

రేపు నవోదయ నమూనా పరీక్ష

సారపాక, జనవరి 5: నవోదయ పరీక్షార్థుల అవగాహన కోసం నమూనా పరీక్షనును ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బీఎన్ఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదలిచిన వారు ఒక రోజు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

డీపను విడుదల చేయాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 5 : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ రాథోడ్ శుక్రవారం ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదలకు అన్నదానం

కొత్తగూడెం అర్బన్, జనవరి 5 : నూతన సంవత్సరం సందర్భంగా రక్ష సంస్థ ద్వారా నిరుపేదలు, దివ్యాంగులకు శుక్రవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రక్ష సంస్థ అధ్యక్షుడు పులి రాబర్ట్ రామస్వామి, కొయ్యడ నగేశ్, నరేశ్, సంక ప్రశాంత్, ముక్క మనోహర్, కాపు రాజసౌజన్య, బిట్టు, రవి పాల్గొన్నారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

గ్రామసభలను ఉపయోగించుకోవాలి: ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్, జనవరి 5: ప్రజాపాలన గ్రామసభలను ప్రజలు ఉపయోగించుకోవాలని, సంక్షేమ పథకాలకు దరఖాస్తులు ఇవ్వాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక సమితిసింగారం గ్రామసభను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నదని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అశ్వాపురం మండలంలో..

అశ్వాపురం, జనవరి 5: అశ్వాపురం పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. బస్టాండ్ ఆవరణలో సర్పంచ్ బానోత్ శారద అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మండలంలోని 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 1,923 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, వైస్